# ఆహా! మన ట్రాన్స్‌పోర్ట్




**మె**దక్‌లోని బ్రహ్మీపూర్ వద్ద లారీలో ప్రయాణం చేస్తున్న పాతికమంది ప్రయాణీకులు లారీ ప్రమాదంలో మరణించిన విషయం న్యూస్ పేపర్స్‌లో చదివిన క్షణం నుంచీ మా కాలనీలో అందరం విషాదంలో మునిగిపోయాం.

ఆ వార్తవిని రాష్ట్ర ముఖ్యమంత్రి 'దిగ్భ్రాంతి' వ్యక్తం చేసిన విషయం కూడా మేము న్యూస్ పేపర్లో చదివాం. మా కాలనీ వాళ్ళందరం కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విషయం గురించి న్యూస్ పేపర్లో రాయమని మా గోపాత్రావ్‌ని అడిగాం గానీ గోపాత్రావ్ వప్పుకోలేదు.

దిగ్భ్రాంతి అనేది కేవలం గొప్పోళ్ళకే గానీ లేదా గొప్ప పదవుల్లో ఉన్నవారికి మాత్రమే కలుగుతుందనీ, సామాన్య ప్రజలకు కలగదనీ, అంచేత న్యూస్ పేపర్లు ఆ విషయం రాయరనీ చెప్పాడు.

మాకు ఆ మాట వినేసరికి ఆశ్చర్యం కలిగింది.

"కేవలం గోప్పోళ్ళకూ, పెద్ద పదవుల్లో ఉన్నవారికే అది కలిగేట్లయితే మరి మాకెందుకు కలిగినట్టు?" గోపాత్రావ్‌ని అడిగాడు శాయీరామ్.

"ఇంకా తెలీనట్లు అడుగుతారేంటి? మన కాలనీలో కూడా గొప్పోళ్ళయిపోయారన్న మాట చాలామంది! అందుకే అది కలిగింది" అన్నాడతను.

"మేం గొప్పోళ్ళయినప్పుడు మా 'దిగ్భ్రాంతిని పేపర్లో వేయవచ్చు కదా!" లా పాయింట్ తీశాడు రంగారెడ్డి.

గోపాల్రావ్ నవ్వాడు.

"మీరు గొప్పోళ్ళయిన విషయం మీకూ నాకూ తెలుసుగానీ బయటి ప్రపంచానికి తెలీదుకదా! తెలిసే వరకూ ఆగండి" అన్నాడతను.

మర్నాడే న్యూస్‌పేపర్లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీదొర స్టేట్‌మెంట్ చూశాం.

"ఆర్టీసీ బస్సులు కాకుండా ప్రైవేట్ వాహనాలలో ప్రజలు ఎక్కువగా ప్రయాణం చేయటం వల్ల అటు ఆర్టీసీకి నష్టాలు రావటమే కాకుండా ఇటు ప్రయాణీకులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. కనుక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయటాన్ని నిషేధించాలి" అవటాని చెప్పారాయన.

మాకందరికీ ఆ స్టేట్‌మెంట్ చూసేసరికి అమితమయిన ఆనందం కలిగింది.

"ఆయన చెప్పిన మాట నిజమే! ఈ లారీల్లో ఎవరూ ప్రయాణం చేయకపోతే ప్రమాదాల్లో ఎవరూ చనిపోరు కదా!" అన్నాడు రంగారెడ్డి సపోర్ట్ చేస్తూ.

"అవును! న్నడిగితే ప్రయాణీకులను తీసుకెళ్ళే లారీ డ్రైవర్‌లను షూట్ చేయాలి" అన్నాడు శాయిరామ్.

"అసలు పల్లెటూళ్ళల్లోని ప్రజలందరినీ ఎడ్యుకేట్ చేయాలి. లారీల్లోనూ, ఇతర ప్రైవేట్ వాహనాల్లోనూ ప్రయాణించటం వల్ల ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉందని వారందరికీ మనం వివరంగా చెప్పాలి!" అన్నాడు చంద్రకాంత్.

"అంటే మనందరం అదో సోషల్ సర్వీస్‌లాగా చేపట్టాల్సిన కార్యక్రమం అవుతుందన్న మాట!" అన్నాడు జనార్ధన్ సైడ్ ఫోజిచ్చి ఓ చేయి గోడమీద ఆనిస్తూ.

"మన ఆర్టీసీ ఎమ్‌డీగారు పాపం ప్రజల ప్రాణాల గురించి అంత ఓవర్‌గా జాలి పడుతూన్నప్పుడు, మన వంతు కర్తవ్యం మనం కూడా నెరవేర్చాలి కదా!" అంది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరీదేవి.

"అంటే మన కాలనీ వాళ్ళందరం కలసి మన రాజధాని చుట్టుపక్కలున్న ఊళ్ళకెళ్ళి మన ఆర్టీసీ చైర్‌మెన్ దొరగారి మనోవేదననూ, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు గురించీ– అందరికీ చెప్పగలుగుతే మనవంతు కర్తవ్యాన్ని మనం నెరవేర్చిన వారిమవుతాం!" అన్నాడు గోపాల్రావ్.

ఆ తరువాత ఆదివారంనాడే ఆ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్వతీదేవి సూచించింది.

అందరం ఆ సూచనను అంగీకరించాం!

ఆరోజు తెల్లారుజామునే నిద్రలేచి ఆడామగా కలసి ఓ పదిమంది సోషల్ సర్వీస్‌కోసం

బయల్దేరాం.

బస్‌డిపో చేరుకోగానే ప్లాట్‌ఫారం మీద బస్ సిద్ధంగా కనిపించింది. అందరం ఆనందంగా ఆ ఎర్రబస్‌లో కూర్చున్నాం.

"చూశారా! మన ఆర్టీసీ ఎంత అభివృద్ధి అయిందో! పాసింజర్ బస్‌లు, లగ్జరీ బస్‌లు, సెమీ లగ్జరీ బస్‌లు– ఎలా కిటకిట లాడిపోతున్నాయో!" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా.

"అవును! ఇంత అద్భుతమయిన బస్ సర్వీస్ పెట్టుకుని ఆ ఊరోళ్ళు లారీలూ ఎందుకెక్కుతారు నాకర్థం కావటం లేదు" అన్నాడు శాయిరామ్.

అందరం కాసేపు భారత ప్రజల అజ్ఞానం గురించి మాట్లాడుకున్నాం.

"నిజానికి మన బస్‌లు మనదేశంలోనే మొదటి బహుమతిని పొందాయ్!" అన్నాడు చంద్రకాంత్. "మిగతా రాష్ట్రాల బస్‌లన్నీ మన తెలుగు బస్‌లముందు బలాదూర్ అట" అన్నాడతను.

మన ఏపీఎస్ ఆర్టీసీకి ఎన్టీఆర్ టైమ్‌లో వరుసగా రెండేళ్ళు నేషనల్ అవార్డు రావటం మాకందరికీ గుర్తువచ్చింది.

"మనదేశంలో ఏమిటి నీ తకాలయ? ఆసియాలోనే బెస్ట్ సర్వీస్ ఆట మనది! మొన్న ఉప్పల్ డిపో కండక్టర్ చెప్పాడు. పైగా అతను అల్లాటప్పా కండక్టరేం కాదు. నా ఫాన్! మొత్తం వరల్డ్‌లోని బస్‌సర్వీసెస్ గురించి టెరిఫిక్ నాలెడ్జ్ ఉందతనికి! అతనే కాదు. సాధారణంగా నా ఫాన్స్ అసోసియేషన్ వాళ్ళందరూ అంతే! చాలా క్లాస్ ఆడియెన్స్" అంటూ జనార్ధన్ ఇంకా చాలా చెప్పబోయాడుగానీ ఛప్పున అతనిని కట్ చేసేశాడు శాయిరామ్.

మా బస్ అగిడిపల్లి చేరుకుంది.

దిగి ఊళ్ళోకి నడిచాం అందరం. ఆ ఊరి సర్పంచ్ మమ్మల్నందరినీ చూసి అప్యాయంగా ఆహ్వానించాడు. మా అందరికీ క్షణాల్లో 'చాయ్' సప్లయ్ చేయించాడు. ఊరివాళ్ళందరూ మా చుట్టూ మూగారు ఆసక్తిగా.

మాకు వాళ్ళ వినయం. విధేయత చాలా ఆనందం కలిగించినయ్.

"పాపం! కపటం, కల్మషం లేని ప్రజలంటే కేవలం ఈ విలేజర్సే" అన్నాడు గోపాల్రావ్.

మేము వెంటనే మా ప్రచారం ప్రారంభించాం.

ఆర్టీసీబస్‌లు మాత్రమే వాళ్ళందరూ ఎక్కాలనీ, లారీలు, ఇతర ప్రైవేట్ వెహికల్స్ ఎక్కితే ప్రమాదానికి గురి అయి ఎగిరిపోతారనీ–

"అగో చెప్పకపోతిరి? మీరు బాంకోళ్ళు కాదా?" అనడిగాడు సర్పంచ్ దెబ్బతిన్న ఫీలింగ్‌తో.

"బాంక్ వాళ్ళం కాదు సర్పంచ్ సాబ్! సోషల్ సర్వీస్‌వాళ్ళం!"

"సోషల్ సర్వీసా! గిదేందో కొత్తగెళ్ళినట్లున్నది? మీరు గూడా మాకు అప్పులు గిట్ల ఇస్తరా?" అనుమానంగా అడిగాడు.

"నోనో- అప్పులిచ్చే సంస్థకాదు మాది. సంఘసేవ చేస్తామన్న మాట" అంటూ రంగారెడ్డి వివరించబోయేలోగానే అందరూ ఒక్కుమ్మడిగా లేచి ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోబోయారు.

"ఛూ నీయవ్వ పైసలియ్యనికి వచ్చినోండ్లు కాదంట"

మేము హడావుడిగా అందరినీ చుట్టుముట్టి రెండు నిముషాలు మా మాటలు వినమని బ్రతిమాలాంగానీ వాళ్ళు మమ్మల్నీ తోసుకుంటూ పారిపోయారు.

సర్పంచ్ మమ్మల్ని చూసి జాలిపడ్డాడు.

"ఇగో ఈడ మావోండ్లు ఎట్లున్నారంటే వచ్చినోండ్లు పైసలయిన ఇయ్యాలె- గుడంబయిన తాగిపించాలె! లేకుంటే నువ్వేం జెప్పినగానీ ఇనరు."

"దీసీజ్ టూమచ్!" అన్నాడు శాయిరామ్ ఇంగ్లీష్‌లో.

"మరి మేము వాళ్ళను ఎడ్యుకేట్ చేయటానికొచ్చాం కదా! ఇదంతా వాళ్ళ బాగుకోసమేకదా!" అన్నాడు రంగారెడ్డి.

"బాగు గురించి జెపుతున్నవ్! మంచిగనే ఉన్నది! మగర్ గిందుల నీకేమీ ఫాయిదా లేకుండానే ఉన్నదా? అహ్! ఒక్కమాట అడుగుతా!"

మేము అదిరిపడ్డాము.

"అరె! ఇదంతా సోషల్ సర్వీస్ అని జెప్పినాం గదువయ్యా! ఇంక ఫాయిదా ఏడకెళ్ళుంటది?" కోపంగా అడిగాడు యాదగిరి.

సర్పంచ్ మొఖంలో రంగు మారిపోయింది.

"ఇగో సోషల్ సర్వీసుగానీ, మరింకేదైనాగానీ ఇయ్యాళ్ళేపు పైసల్లేకుండా ఎవళ్ళు జేస్తారువయ్యా? ఈడెవళ్ళూ చెవిల ఫూల్ పెట్టుకుని లేరు సేఠో! మస్తుమందిని చూసినాం! మీకు ఆర్టీసీవోళ్ళిచ్చే పైసల్లో సగం మాకియ్యండ్రి! మీరేం జెప్పినాగానీ ఇంటాం! గంతనేగాని ఫుక్కట్‌గా ఇననికి ఈడెవళ్ళూలేరు పోండ్రి" అనేసి తనదారిన తను వెళ్ళిపోయాడు.

అందరం అతనిని మళ్ళీ చుట్టుముట్టి బ్రతిమాలాం అసలు విషయమంతా చెపుతూ.

చాలాసేపటి తర్వాత కన్విన్స్ అయాడతను.

"మీరెవళ్ళూ పైసల్దినటం లేదని నాకు భరోసున్నదివయ్యా! కానీ ఈ ఊరోండ్లు మాత్రం ఇనరు. ఆళ్ళువచ్చి మీరు చెప్పెడిది ఇనాన్లంటే ఒక్కటే రాస్తా ఉన్నది."

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు శాయిరామ్.

"మీతోని కలసి ఈడకొచ్చిన ఈ పోరిలున్నయ్‌గదా! ఆళ్ళను డాన్స్ చేయమను! బరాబర్ అస్తారందరూ!"

ఆమాట వింటూనే పార్వతీదేవి, రాజేశ్వరి, సావిత్రమ్మ ముగ్గురూ వులిక్కిపడ్డారు.

"ఏమిటి? మేము డాన్స్ జేయాలా? ఏం పిచ్చిపిచ్చిగా ఉందా? మేమెట్లా కనబడుతున్నాం నీకు?" అంటూ అతనిమీద విరుచుకుపడేసరికి సర్పంచ్ కంగారుపడి పోయాడు.

"గట్ల గరమౌతారేందమ్మా! సోషల్ సర్వీస్ అంటున్రు గదా డాన్సులు చేస్తారనుకొని దాన్ని గురించ చెప్పిన! ఇష్టం లేకుంటే జేయకండ్రి! మీ మీటింగ్‌కి పబ్లిక్‌గావాల్నన్నారని అయిడియా జెప్పినా!"

మేము మాట్లాడుతూండగానే చాలామంది ఊరోళ్ళు నెత్తిన కూరగాయల బుట్టలతోనూ, పాలడబ్బాలతోనూ, బస్‌స్టాండ్ దగ్గరకు వెళుతూ కనిపించారు.

మేమూ వాళ్ళదగ్గరకు చేరుకుని మా ప్రచారం ప్రారంభించాం.

"ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గారూ ప్రభుత్వమూ మీమీద జాలితోనే, మీరు ప్రమాదాలకు గురి కాకూడదనే మీకు మనవి చేస్తోంది. కేవలం ఆర్టీసీ బస్‌ల్లోనే ప్రయాణం చేయండి. మీ ప్రాణాలను కాపాడుకోండి."

వాళ్ళందరూ మొఖాలు చూసుకున్నారు.

"ఆర్టీసీవాళ్ళు కేవలం మీ కోసమే పాసింజెర్ సర్వీస్‌లు నష్టం వస్తోన్నా నడుపుతున్నారు" చెప్పాడు రంగారెడ్డి.

"ఆమాట నిజమేనే! పద్దినాల కిందట పాపం ఇరవై అయిదుమంది మెదక్ డిస్ట్రిక్ట్‌ల లారీ ప్రమాదం జరిగి ఖతమయిపోయిన్రు!" అన్నాడొక ఊరతను మా మాటలు సపోర్టుచేస్తూ.

ఆ మాటతో మాకు చాలా బలం వచ్చినట్లయింది.

వెంటనే లారీలు, లేక ఇతర ప్రైవేట్ వాహనాలమీద ప్రయాణం చేయుట వలన కలిగే నష్టములు అన్న సబ్జెక్ట్‌మీద అరగంట చెప్పిందే చెపుతూ ఉపన్యాసం ఇచ్చాడు రంగారెడ్డి.

"నేను సినిమాలో హీరోవేషం వేయడానికి మద్రాసు వెళుతున్నప్పుడుకూడా లారీ యాక్సిడెంట్‌లో ఒకడు చనిపోయినట్లు పేపర్లో చూశాను" అన్నాడు జనార్ధన్.

ఆమాట ఆనటంతోనే కొంతమంది జనార్ధన్ చుట్టూ మూగారు.

"ఏ సిన్మాలో ఏసినావు నువ్వు?" అడిగాడో స్టూడెంట్.

జనార్ధన్ జవాబు చెప్పకుండా సిగరెట్ వెలిగించుకుంటూ సినిమా హీరోలా ఆ

పక్కనేవున్న చెట్టుమీద చేయివేసి వెనక్కు తిరిగి చూశాడు.

"ఒకటేమిటి? ఆరు సినిమాలు!" అన్నాడు చాలా నిర్లక్ష్యంగా.

ఈలోగా ఓ ఇసుకలారీ పెద్దగా హారన్ కొట్టుకుంటూ వచ్చి ఆగింది.

మరుక్షణం అందరూ బుట్టలతో, పాలడబ్బాలతో ఎగబడి లారీ ఎక్కసాగారు. మాకు మతిపోయినట్లయింది.

"సోదరులారా! లారీలలో ప్రయాణం చేయకండి! మీ ప్రాణాలు పోగొట్టుకుంటారు. మా సర్వే ప్రకారం లారీలో ప్రయాణించేవారిలో నూటికి పదిహేనుమంది లారీ ప్రమాదాల్లో చనిపోతున్నారు" అన్నాడు శాయిరామ్.

వాళ్ళ మొఖాల్లో మార్పు కనిపించింది.

అది చూసి యాదగిరి వుత్సాహం పుంజుకున్నాడు.

"ఇగో– మీకు తల్లున్నది, నాయనున్నాడు, భార్యున్నది, పిల్లగాండ్లున్నారు. నువు లారీ ప్రమాదంలో చచ్చిపోయినావంటే గీళ్ళందరి గతేం కావాలి? పరిషానౌతరా లేదా? మొన్న యాక్సిడెంట్‌ల పోయినోండ్ల సంగతేమాయె? తిననికి తిండి గిట్టలేక రోడ్లమీద వడిగ్రన్నట్లు– ఎవళ్ళూస్తరువయా వాళ్ళను. లారీలోళ్ళు జూస్తరా? గదే నువ్వు ఆర్టీసీ బస్ యాక్సిడెంట్‌ల జచ్చివావనుకో! గవర్నమెంటూరుకుంటదా? ఖామోషుంటదా? బరాబర్ నీవోండ్లకు పైసలిస్తది! మీ పిల్లగాండ్లకు కొలువులిస్తది"

యాదగిరి స్పీచ్ చాలా పవర్‌పుల్‌గా పనిచేసింది.

రెండు నిమిషాల్లో అందరూ లారీ దిగిపోయి కింద నిలబడ్డారు.

లారీవాడు మావంక కోపంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే దూరంగా దుమ్మురేపుకుంటూ వస్తోన్న ఎర్రబస్ కనిపించింది.

"చూసిన్రా! నేను జెప్పలే! ఆర్టీసీవోళ్ళు మీ గురించే మంచిగ బస్‌లు ఏసిన్రని! ఆరామ్ తోటి సీట్ల కూర్చుని శహర్ పోవాలె! బేఫికర్ గుజరాయించాలె!"

అందరూ మావేపు అభినందన పూర్వకంగా చూశారు.

"అవ్‌సార్! ఇన్ని దినాలు పాగల్‌గాండ్ల లెక్క లారీల్లోనే పోతున్నాం!" అన్నాడొకతను.

అందరం చూస్తుండగానే ఎర్రబస్ కిటకిటలాడుతూ బయటకు వేలాడుతున్న జనంతో ఆగకుండా వెళ్ళిపోయింది.

"రోకో రోకో" అని అరుస్తూ అందరం బస్‌వెనుక పరుగెత్తాంగానీ బస్ ఆగలేదు. మాకు కోపం కూడా ఆగలేదు.

"యాదగిరీ నెంబర్ నోట్ చేసుకో! ఆర్టీసీ ఎమ్‌డీ గారికి చెపుదాం ఈ బస్‌సంగతి!" అన్నాడు రంగారెడ్డి ఆవేశంగా.

యాదగిరి డయిరీ తీసి చకచకా బస్ నెంబర్ రాసుకున్నాడు.

సరిగ్గా అప్పుడే ఇంకో ఇసుకలారీ పెద్దగా హారన్ కొట్టుకుంటూ వచ్చి ఆగింది.

అందరూ అమాంతం లారీ మీదకు ఎగబడబోయారుగానీ మేమందరం చేతులు పట్టుకుని వారికి అడ్డంగా నిలబడ్డాం.

"సోదరులారా తొందరపడకండి! ఇంకో బస్ వచ్చే టైమవుతోంది! మనం ఓ గంట ఆలస్యంగా వెళ్ళినా ఫర్లేదుగానీ క్షేమంగా, సురక్షితంగా వెళ్ళాలనీ ఆర్టీసీ వాళ్ళు చెప్తున్నారుకదా!"

ఆ లారీ వెళ్ళిపోయింది. ప్రతి పావుగంటకు బస్సుందన్నారుగానీ ఒక్కటీ కనిపించటం లేదు– ఈ సారి గంటయినాగానీ బస్ జాడలేదు. ఉండుండి ఎక్స్‌ప్రెస్ బస్‌లు మాత్రం వేగంగా వెళ్ళి పోతున్నయ్.

"ఏమయ్యా మీ దిక్కుకెళ్ళి మా పన్లన్ని ఖరాబయి పాయె! ఇంకో గంటయెనా అంటే పాలుపోయించుకునేటోళ్ళు వాపస్ జేస్తారు. కూరగాయల ధరగూడ గిరాయించి పోతది– ఈ నష్టమంతా ఎవళ్ళు ఇయ్యాలె?" అన్నాడొకతను మావేపు కోపంగా చూస్తూ.

మా గుండెలు ఝల్లుమన్నాయ్.

ఆ నష్టమంతా మమ్మల్ని ఇమ్మంటారేమోనని.

సరిగ్గా అప్పుడే దూరంగా మరో ఎర్రబస్ కనిపించింది.

"అదిగో వస్తోంది. చూశారా! ఎప్పటికీ తొందపడగూడదు! ఓర్పే విజయం! అన్నాడు శాయిరామ్.

"అదిగూడ ఆగదు! మేం దినాం సూట్టంలే? ఒక్క బస్ కూడా ఆగదీడ!" అన్నాడిం కొకతను.

మాకు భయం వేసింది.

ఆ బస్ కూడా ఆగకపోతే మా పరువు పోతుంది.

"యాదగిరి! అందరం అడ్డు నిలబడదాం లేకపోతే వాడు కూడా ఆపేట్లు లేదు" అన్నాడు రంగారెడ్డి అప్పటికప్పుడే గొప్ప ప్లాన్ ఆలోచిస్తూ.

అందరం రోడ్‌కడ్డంగా నిలబడ్డాం.

"బస్ ఓ పక్కకు ఒరిగిపోయి నెమ్మదిగా వచ్చి ఆగింది. డ్రైవర్ మావేపు కోపంగా చూశాడు.

"నీయవ్వ ఎవళువయా మీరు? ఎందుకాపిన్రీడ?" అడిగాడు మండిపడుతూ.

"వీళ్ళందరూ బస్ ఎక్కాలి!"

"ఏడెక్కుతారు? నా నెత్తిమీదనా? జాగా ఏడున్నది? కండ్లులేవా మీకు? ఓవర్

లోడున్నది కానరాలే?"

అప్పటికే జనం బయటకు వేలాడటంతో ఇంకెవరూ బస్ ఎక్కటానికి వీల్లేకపోయింది. ఆ బస్ వెళ్ళిపోయింది.

మాకు భయం మొదలయింది. వీళ్ళందరూ కలసి మమ్మల్ని తిడతారేమోనని.

"నీయవ్వ ఆర్టీసీ బస్‌లో పొమ్మని చెప్తున్రు ఏడాగినయ్ బస్‌లు?" మమ్మల్ని ఎటాక్ చేయటం ప్రారంభించాడొకతను.

"ఈపాలు గిట్ల ఖరాబయినాయో– ఈ సాలెగాండ్లను ఈడనే తందాం" అన్నాడింకొకడు.

"ఏయ్– ఏమ్మాట్లాడుతున్నావ్?" అంటూ ఎదురు తిరిగాడు యాదగిరి.

"లేకుంటే ఏందిది? పోయేటోళ్ళను రుకాయిస్తుంటివి? బస్‌లు ఆపకపోతివి! దమాకేమన్న ఖరాబయి ఈడకొచ్చిన్రా మీరు" మూడోవాడు మీదకొచ్చాడు.

దాంతో మాకు పరిస్థితి క్షీణిస్తోందని అర్థమయిపోయింది.

సరిగ్గా అప్పుడే ఇంకో ఇసుకలారీ వచ్చిందిగానీ దాన్నిండా అప్పటికే జనం నిండిపోయి వుండటంతో ఆగకుండా వెళ్ళిపోయింది.

"ఏయ్! ఇప్పుడేమంటవ్! గిప్పుడు లారీల జాగా దొరికెడిది కూడా భరోసాలేదు."

మా దగ్గరకొచ్చి నిలదీశాడింకోవ్యక్తి.

మాకేం చెప్పాలో తెలీలేదు.

"ఇంకో ఎర్రబస్ ఇంకో పావుగంటలో వస్తుంది కదా?"

"అది అస్సలు ఆగదు! జమానాకెళ్ళి జూస్తున్నాం"

"ఇగో! ఇంకో అర్థగంటలో మేమీడకెళ్ళిపోవాలె! బస్ రుకాయిస్తరో, లారీ రుకాయిస్తరో మాకెరుకలే! లేకుంటే బొక్కలిరుగుతయ్" మరోడు వార్నింగిచ్చాడు.

మా మొఖాల్లో రంగులు మారిపోయాయ్.

"బుద్ధి తక్కువయి వచ్చాం" అన్నాడు శాయిరామ్.

"అయినా సోషల్ సర్వీస్ గవర్నమెంట్‌తో సంబంధం లేనిదయితేనే చేయాలిగానీ ఉంటే ఇలాగే అవుతుంది" అన్నాడు రంగారెడ్డి.

మరో పావుగంటలో ఇంకో లారీవచ్చిందిగానీ అదికూడా కిటకిట లాడిపోతూండటం వల్ల ఆగకుండా వెళ్ళిపోయింది.

మాకు టెన్షన్ పెరిగిపోతోంది.

అందరూ డైరెక్ట్‌గానే మమ్మల్ని తిడుతున్నా వినబడనట్లు దిక్కులు చూస్తున్నాం!

ఈసారి ఇంకో లారీ దూరంగా కనిపించింది.

ఆ లారీ కూడా ఆగకపోతేవాళ్లు మమ్మల్ని చావగొడతారన్న విషయం అర్థమయిపోయింది మాకు!

అందుకని అందరం పరుగుతో రోడ్ మధ్యకెళ్ళి చేతులూపుతూ లారీకి అడ్డంగా నిలబడ్డాం.

లారీ వచ్చి ఆగింది.

దాన్నిండా కూడా జనం కనిపించేసరికి మా పై ప్రాణం పైనే పోయినట్లయింది.

"ఎలాగోలా వీళ్ళను ఎక్కించుకెళ్ళండి డ్రైవరుగారూ ప్లీజ్" అంటూ బ్రతిమాలసాగాడు గోపాల్రావ్?

"మాకేం ఆకలున్నదా? నీయవ్వ జగా ఏదున్నదింకా?"" అంటూ లారీ భాషలో. మమ్మల్ని ఏవేవో తిట్టి మళ్ళీ స్టార్ట్ చేసుకెళ్ళిపోయాడు.

మరో రెండు లారీలు కూడా జనంతో నిండి వెళ్ళిపోయినయ్.

"ఏయ్! ఈ పాలకు, కూరగాయలకు మీరే పైసల్ గట్టండ్రి" అంటూ రంగారెడ్డి చొక్కా పట్టుకున్నాడో యుకుడు.

అందరం అతికష్టం మీద అతని చొక్కా విడిపించాం.

ఈసారి మరోలారీ కనిపించేసరికి మళ్ళా మేము రోడ్‌కి అడ్డంగా నిలబడ్డాం. దగ్గరుకొస్తున్న కొద్దీ లారీ వేగం పెరిగిపోవటంతో మాకు గుండె ఝల్లుమంది.

"వాడు తాగి ఉన్నట్లున్నాడు" అన్నాడు శాయిరామ్ వణుకుతూ. దగ్గరికొచ్చేసినా లారీ వేగం తగ్గకపోవటంతో అందరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు అంచులకు పరుగెత్తాం! అందరం ఒకేసారి పరుగెత్తటంతో ఒకరిద్దరు కింద పడటం కూడా జరిగింది. పార్వతమ్మకి మోచేతులు కొట్టుకుపోయినయ్.

"ఇగో ఇంకొక్క అర్థగంట టైమిస్తున్నాం! ఈ లోపట లారీ ఆపక పోయిన్రంటే మొత్తంమీద పైసలు మాకు గట్టాలె! సమజయిందా?"

సరిగ్గా అప్పుడే ఇంకో లారీ వస్తూ కనిపించింది.

మళ్ళా అందరం రోడ్డుకి అడ్డంగా నిలబడ్డాం.

లారీ ఆగింది.

సగం మేరకు జనం నిండిపోయి ఉన్నారు దానిమీద. డ్రైవరు అంతమందిని ఎక్కించుకోడానికి వప్పుకోలేదు.

"ఎవళ్ళయిన కిందపడితే ఆ ఫాల్తూ కిరికిరి నాకు తగులుకుంటది భాయ్. ఇంకో లారీలో రాండ్రి" అన్నాడు మళ్ళీ స్టార్ట్ చేయబోతూ.

"అట్లనకు స్వామీ! కావాల్నంటే ఓ పాతిక రూపాయలూ మేము ఎక్కువ ఇస్తాం!

తీసుకో!" అంటూ బలవంతంగా ఓ పాతిక డ్రైవర్ చేతిలో పెట్టి అందర్నీ లారీ ఎక్కించాము. లారీ వెళ్ళిపోయింది.

"అమ్మయ్యా! కిరికిరి వదిలిపోయింది" అన్నాడు రంగారెడ్డి తేలిగ్గా గాలి పీల్చుకుంటూ.

"ఇంకోసారి ఛస్తే ఇలాంటి ఫాల్తూ సోషల్ సర్వీస్ చేయొద్దు" అన్నాడు శాయిరామ్.

"అయినా ఈ మూర్ఖపు ప్రజలకు మనం ఎంత చెప్పినా, ఏం చెప్పినా ప్రయోజనం లేదు. లారీల్లో వెళ్తూనే ఉంటారు. ఛస్తూనే వుంటారు!" అన్నాడు గోపాల్రావ్.

దూరంగా మరో ఎర్ర బస్ కనిపించింది.

"పదండి! మనదారిన మనం ఆ బస్‌లో వెళ్ళిపోదాం!" అన్నాడు శాయిరామ్.

అందరం బస్ ఆపమన్నట్లు చేయి అడ్డంగా చాపాంగానీ బస్ ఆగలేదు.

"ఓ గంట ఆలస్యం అయితే అయింది. ఇంకో బస్ వచ్చాక వెళ్దాం! అంతేగానీ ఈ ఊరోళ్ళలాగా కొంప మునిగిపోయినట్లు లారీల్లో వెళ్ళాల్సిన ఖర్మ మనకేంటి?" అన్నాడు రంగారెడ్డి.

అందరం మాట్లాడుకుంటూనే ఉన్నాం అంతలోనే టైం ఒంటిగంటయిపోయింది. ఒక్క బస్‌కూడా రాకపోయేసరికి మాకు చిరాకు మొదలయింది.

"నాకు ఆకలేస్తోంది! ఇంతవరకూ ఎప్పుడూ ఒంటిగంటవరకూ భోజనం చేయకుండా ఉండలేదు" అంది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరీ.

"నిజం చెపుతున్నాను. నాకు ఇందాకట్నుంచీ ఆకలికి కళ్ళు తిరుగుతున్నాయ్" అంది పార్వతీదేవి.

"అయినా ఈ దరిద్రపు బసులు ఒక్కటికూడా తగలడటం లేదేమిటి?" కోపంగా అన్నాడు శాయిరామ్.

"నాకు నాలుగింటికల్లా మా ఫ్రెండ్ వాళ్ళ గృహప్రవేశానికి వెళ్ళాలి! లేకపోతే చాలా ఫీలవుతాడు వాడు" అన్నాడు చంద్రకాంత్.

"మా బాస్ ఇవాళ సాయంత్రం మీటింగ్‌కి ఫైల్స్ తీసుకుని రమ్మన్నాడు! లేకపోతే ఉద్యోగమే ఊడిపోయినంత ప్రమాదం జరుగుతుంది" అన్నాడు శాస్త్రి దిగులుగా.

"ఇవాళ ఆరింటికి మంజు టాకీస్ దగ్గర మా గాళ్‌ఫ్రెండ్‌ని కలుసుకోవాలి. లేకపోతే రేపట్నుంచీ ఆ విశ్వనాథం గాడికి గాళ్‌ఫ్రెండయిపోతుంది" అన్నాడు స్టూడెంట్ సురేష్.

అప్పుడే ఆ ఊరి సర్పంచ్ వచ్చాడు ఓ సంచితో.

"అప్పటికెళ్ళి ఈడనే ఉన్రా మీరు?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"బస్‌కోసం చూస్తున్నాం!" అన్నాడు రంగారెడ్డి.

"బస్సా! ఈ టైమ్‌ల బస్సేడున్నది? సాయంత్రం నాలుగ్గంటల కొకటున్నది!"

మా గుండెలవిసిపోయినయ్.

అప్పుడే లారీ వచ్చి ఆగింది.

సర్పంచ్ లారీ ఎక్కి మావేపు జాలిగా చూశాడు.

"మీరు భీ లారీలో ఎక్కండ్రి! బస్ గురించి సుల్చుంటే ఈడనే రుకాయించి పోతరు" అన్నాడతను.

మేము మొఖాలు చూసుకున్నాంగానీ లారీ ఎక్కడానికి ధైర్యం చేయలేకపోయాం!

లారీ వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగ్గంటలకల్లా శోష వచ్చినట్లు వాలిపోయాం అందరం ఉండుండి దూరంగా ఉన్న పాకలో పాచిపోయిన జంతికలు మాత్రం తీసుకొచ్చి తలోటీ ఇస్తున్నాడు యాదగిరి.

అయినా బస్ జాడమాత్రం లేదు.

"నేను లారీలో వెళ్ళిపోతాను" హఠాత్తుగా పూనకం వచ్చినట్లు లేచి నిలబడింది రాజేశ్వరి.

"మీకేం పిచ్చెక్కిందా? లారీల్లో ప్రయాణం చేస్తే ప్రమాదమని అందరికీ చెప్పటానికొచ్చి మీరు లారీలో వెళతారా?" కోపంగా అన్నాడు శాయిరామ్.

"ఈ బోడి ఆర్టీసీ బస్సులను నమ్ముకోవటం నావల్లకాదు. మీరెవరొచ్చినా రాకపోయినా నేను లారీలోనే వెళ్తున్నా" అందామె మొండిగా.

నిజానికి మాకూ లోపల్లోపల లారీలోనో, ట్రాక్టర్‌లోనో, టెంపోలోనో, ఎలాగోలో ఆ ఊరువదలి ఇంటికి చేరుకోవాలనుంది. సరిగ్గా అప్పుడే సర్పంచ్ సిటీకి వెళ్ళటం, పని చూసుకుని ఇంకో లారీలో తిరిగి రావటం కూడా జరిగిపోయింది.

"నీయవ్వ! ఇంకా బస్‌గురించే ఇంతజార్‌లో ఉన్నారు? అహహ" అంటూ వెళ్ళిపోయాడు.

అప్పుడే ఓ లారీ శరవేగంతో వచ్చి ఆడిగింది.

"ఆ! లష్కర్ లష్కర్ లష్కర్" అరచాడు క్లీనర్ మావేపు చూస్తూ.

రాజేశ్వరి పరుగుతోవెళ్ళి ఇసుకమీద ఎక్కికూర్చుంది.

ఆమె వెనుకే అందరం ఆర్టీసీ బస్‌లను తిట్టుకుంటూ లారీ ఎక్కాం.

డ్రైవర్‌కి మందు ఎక్కువయిపోవటం వల్ల లారీ పిచ్చెక్కినట్లు రోడ్డంతా తిరిగేస్తూ శరవేగంతోపోతోంది.

అయినాగాని మాకా ప్రయాణం రిస్క్ అనిపించలేదు. భయం వేయలేదు.

ఇంకా ఆర్టీసీ బస్‌కోసం ఎదుర్చూడ నక్కర్లేదన్న నిజం ఎంతో ధైర్యాన్నిస్తోంది.




ఇసుకలో మా పక్కనే కూర్చున్న ఓ ఆర్టీసీ డ్రైవర్ న్యూస్ పేపర్‌లోని ఓ అయిటమ్ గట్టిగా చదివి తన సహోద్యోగికి వినిపిస్తున్నాడు.

"విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ కంటే అతిచిన్న రాష్ట్రాలయిన మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, కేరళల్లో ఆంధ్రప్రదేశ్‌కంటె కొన్ని వేల బస్‌లు ఎక్కువగా తిరుగుతున్నాయ్. మన రాష్ట్రంలో మన ప్రజావసరాలకు సరిపోయేన్ని బస్‌లు వేయాలంటే కనీసం పదహారువేల బస్‌లు కొని నడపాల్సి ఉంటుంది. ఏనాటికయినా అది మన దివాణాకోరు ప్రభుత్వం వల్ల కాని పని! అంతవరకూ రాష్ట్ర ప్రజలు చచ్చినట్లు లారీల్లో తిరగాల్సిందే ఆర్టీసీ బస్ కోసం ఎదుర్చూస్తూ చావటం కంటే, బ్రతుకుమీద లాటరీ వేసుకుంటూ లారీల్లో తిరగటమే ఉత్తమం!"

మేమందరం ఆ వార్తలు వినీవిననట్లు ఊరుకున్నాం.

కాసేపటికి హైదరాబాద్ పొలిమేరల్లోకొస్తోండగా రోడ్ మీద కనిపించిన దృశ్యం చూసి షాకయ్యాం. రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని నుజ్జునుజ్జయాయ్.

పోలీసులు వాటిమధ్య నుంచి డెడ్‌బాడీస్ తీసి అంబులెన్స్‌లోకి చేరుస్తున్నారు.

* * * * *